# ముక్కుపొడెం డబ్బా

**-పి.వి.ప్రభాకరమూర్తి**

కాలువ గట్టుమీద శివాలయం తపోదీక్షలో ఉన్న మునిలా గంభీరంగా ఉంది. లోపలివాడిని చూడాలంటే నన్ను దాటుకు వెళ్లాల్సిందే అన్నంత ధీమాగా, గర్వంగా, ఠీవిగా కనిపిస్తోంది ఆలయ శిఖరం. ఈ గోపురంలోనే మేము నివసించేది. అందుకే ఈ ప్రదక్షిణలు అన్నట్లుగా గోపురం చుట్టూ తిరుగుతున్నాయి పావురాలు. పగలంతా పొలాల్లో రెక్కలు ముక్కలు చేసుకున్న కూలీజనం కబుర్లు చెప్పుకుంటూ ఇంటి దారి పట్టారు. మర్రిచెట్టు మీద పగలంతా నిద్రపోయిన గబ్బిలాలు కీచుమని అరుచుకుంటూ ఆహారం వేటకు బయలుదేరాయి. శివుడితో మాట్లాడి మాట్లాడి బోరు కొట్టినట్లుగా మంటపంలో తిరుగుతున్నారు పంతులుగారు.

నేను కాకినాడలో బ్యాంకు ఉద్యోగం చేస్తున్నాను. నెలకి ఒకసారైనా మోదుకూరు వస్తాను. ఇక్కడ మా అక్కబావల దగ్గర రెండురోజులు కాలక్షేపం చేయడం నాకు అలవాటు. కాలువ గట్టుమీద కూర్చుని అక్కడినుంచి ప్రకృతిని ఆస్వాదించడం నాకు ఎంతో ఇష్టం.

"ఎవరు నాయనా నువ్వు?'' అన్న పలకరింపుతో ఆలోచనల్లో వున్న నేను ఉలిక్కిపడ్డాను. ఎవరో ముసలాయన. వయసు అరవైపైనే వుండవచ్చు. నేను ఆయనకి నమస్కారం పెట్టి మా బావగారి పేరు చెప్పాను.

"ఓహో...అలాగా... ఊరికి కొత్త మనిషిలా కనిపిస్తే అడిగాను. ఏమనుకోకు నాయనా'' అంటూ భుజంమీద తువ్వాలు క్రింద పరచుకుని నా పక్కన కూర్చున్నారు.

"నా పేరు రామప్పపంతులు నాయనా. ఈ ఊర్లోనే హెడ్‌మాస్టార్‌గా చేసి ఈ మధ్యనే రిటైరయ్యాను. అందరూ నన్ను రామప్ప అంటారు'' అని పరిచయం చేసుకున్నారు. పై జేబులోంచి ముక్కుపొడెం డబ్బా తీసి ఆయన పీల్చి డబ్బా నాకు అందించబోయారు. నేను వద్దని సున్నితంగా తిరస్కరించాను. ముక్కుపొడెం పీల్చడం అప్పుడప్పుడూ నాకు అలవాటే. కానీ ఎందుకో అప్పుడు నాకు పీల్చాలనిపించలేదు.

ఆ మాటా ఈ మాటా మాట్లాడుతూ చివరకి దయ్యాలున్నాయా లేదా అనే సబ్జెక్టుమీద చాలా సేపు మాట్లాడుకున్నాం. రామప్పగారు ఆయన చిన్ననాటి సంగతులు చెబుతూ వాటి ఆధారంగా దెయ్యాలు ఉంటాయని నిర్ధారించారు. ఐగా దెయ్యాల్లో చాలా రకాలు ఉన్నాయని, వాటిలో ముఖ్యంగా కొరివి దెయ్యాలు చాలా ప్రమాదమని చెప్పారు. ఊరి చివరవున్న చింతచెట్టు మీద రకరకాల దెయ్యాలు నివాసముంటాయని, వాటిలో కొన్నింటికి పాదాలు వెనక్కి తిరిగి ఉంటాయని, దారినపోయే వారిని పిల్లదెయ్యాలు ఏడిపిస్తూ ఉంటాయని, వాటిలో కొన్ని ఉపకార దెయ్యాలు, కొన్ని అపకార దెయ్యాలుంటాయని వాటిని విభజించారు. ఉపకార దెయ్యాలు మనుషుల సహాయం చేస్తుంటాయని, బాటసారులతోపాటు కాసేపు బాతాఖానీ వేస్తాయని సరదాగా తమ చేష్టలతో నవ్విస్తాయని అన్నారు. అపకార దెయ్యాలు మాత్రం మనుషుల రక్తం పీలుస్తాయని, మనం మిరపకాయ బజ్జీలు వేసుకున్నట్లు మన అవయవాలను బజ్జీలుగా వేయించి విందు చేసుకుంటాయని వళ్లు జలదరించేలా చెప్పారు. నేను వింటూ కూర్చున్నాను.

"అబ్బాయ్... చీకటి పడుతోంది. ఇక నేను వెళతాను. నాకోసం మావాళ్లు ఎదురు చూస్తూ ఉంటారు'' అంటూ ముక్కుపొడెం ఆఖరిపట్టు బిగించి బయలుదేరారు రామప్పపంతులుగారు.

నేను చిన్నగా నవ్వి వీడ్కోలు చెప్పాను.

దెయ్యాలున్నాయో లేదో తెలియదుగానీ నాకు అవంటే చిన్నతనం నుంచీ భయం. చిన్నతనంలో మరొకరి సాయం లేకుండా ఎక్కడికీ వెళ్లేవాడినికాదు. నా భయం చూసి మా మామ్మ "తాయారూ! వీడికి ఆంజనేయస్వామి బిళ్లని మెడలో కట్టవే. భయం గియం పోతాయి'' అని మా అమ్మకి చెబుతూ ఉండేది. భయం పోవడం మాట దేవుడెరుగు కానీ మెడలో బిళ్ళని చూసేసరికి దెయ్యాలంటే భయం పోవడానికేకదా దీన్ని కట్టుకుంది. అనుకున్నదే తడవుగా దెయ్యం గుర్తుకువచ్చి వణికిపోయేవాడిని. పెద్దయ్యేకొద్దీ భయం తగ్గిందికానీ శరీరంలో ఏదో మూల నలకంత ఉందేమోననే అనుమానం అప్పుడప్పుడు కలుగుతోంది. దానికిసాయం ఈ ముసలాడు దెయ్యాల సబ్జెక్టుమీద చాంతాండంత ఉపన్యాసం ఇచ్చి మరీ పోయాడు అనుకున్నాను.

దూరంగా బురదపాము ఒకటి నీళ్లల్లో వున్న కప్పకోసం ఎదురు చూస్తోంది. కప్ప బిక్క మొహం వేసుకుని పామువైపు చూస్తోంది. వర్షం వస్తుందన్న సూచనగా దగ్గరగా కొండ మీంచి చల్లగాలి వేస్తోంది. చల్లగాలికి గట్టుమీద ఉన్న గడ్డిపువ్వు అటూ ఇటూ ఊగుతూ ఆనందాన్ని అభినయిస్తోంది. నేను నెలకొక్కసారైనా ఈ కాలువగట్టుమీదకి వచ్చి ప్రకృతిని రెండు కళ్లతో జుర్రుకుంటాను. క్రమంగా చీకట్లు అలముకుంటున్నాయి. శివుడ్ని పడుకోబెట్టి పంతులుగారు ఇంటికి వెళ్లిపోతున్నారు. చంద్రుడి చిక్కటి పెరుగుబిళ్లలా ఉన్నాడు. చినుకులు పెద్దవి అవడంతో పక్కనేవున్న చింత చెట్టుకిందకి చేరాను. మట్టివాసన కమ్మగా వస్తోంది. తల తడవకుండా

చేతులు అడ్డుపెట్టుకుని గబగబా చెట్టుకింద నిలబడింది పైడమ్మ.

వస్తూనే నమస్కారం పెట్టి "బాగున్నారా బాబూ" అంది.

"ఆ...బాగున్నాను" అంటూ ఓ యాభైరూపాయల నోటు పైడమ్మకు అందించబోయాను.

'వద్దు...వద్దు' అని డబ్బు తీసుకోలేదు. నేనే బలవంతంగా పైడితల్లి చేతికి అందించాను. రెండుచేతులూ పైకెత్తి నమస్కారం పెట్టి "కలకాలం ఆరోగ్యంగా జీవించాలి బాబూ" అంటూ దీవించింది.

పైడితల్లి మా అక్కా వాళ్లింట్లో పనిమనిషి. అందుకే గుర్తు పట్టి పలకరించింది.

"బాబుగారూ! అమ్మగార్ని తీసుకొచ్చారా?" అడిగింది పైడితల్లి.



"లేదు. పురిటికి వాళ్లమ్మగారి ఊరు వెళ్లింది'' చెప్పాను,.

వాన బొట్లు బొట్లుగా పడుతుండడంతో తల తుడవడం మొదలయింది. జేబురుమాలు తీసి తలకి చుట్టుకున్నాను. శివాలయంలో వున్న మారేడు చెట్టుమీద వర్షపునీరు, చంద్రుడి వెలుతురు పడి ఆకులన్నీ గమ్మత్తుగా మెరుస్తున్నాయి.వర్షం చినుకులన్నీ పిల్ల కాలువలుగా మారి పెద్దకాలువ వైపు దారి తీసాయి. ఇంతలో ఉన్నట్టుండి మెరుపు మెరిసింది. దాన్ని తరుముకుంటూ వచ్చిన ఉరుము ఫెళఫెళమంది మధ్యకు విరిగిపోయిన ముసలి వృక్షంలా. ఆకాశం అకస్మాత్తుగా చిరిగిపోయిన కొత్త దుప్పటిలా కనిపించింది.

"వర్షంలో తడుస్తూ ఇంతసేపు ఎందుకు ఉన్నారు బాబూ?'' అడిగింది పైడితల్లి.

"రామప్పపంతులు మాస్టారు కనిపిస్తే మాట్లాడుతూ కూర్చున్నాను. సమయం అసలు తెలియలేదు. ఇంతలో వర్షం మొదలయింది. నువ్వన్నట్లుగా ముందే వెళ్లిపోవాల్సింది'' అన్నాను చెట్టు చాటు నుండి బయటకు వచ్చి వర్షం తగ్గిందేమోనని చూస్తూ.

"రామప్పగారా? ఆయన పోయి దగ్గర దగ్గర నెలరోజులు అవుతోంది కదా'' ఆశ్చర్యంతో నోరు వెళ్లబెట్టింది పైడితల్లి.

పైడితల్లి మాటలు విన్న నాకు వెన్నులోంచి చలి మొదలయింది. అంత వర్షంలోనూ మొహమంతా చెమట్లు పట్టాయి. తలకు చుట్టుకున్న జేబురుమాలుతీసి మొహం తుడుచుకున్నాను. ఇక అక్కడ ఒక్కక్షణం ఉండబుద్ధి కాలేదు. గబగబా అక్కావాళ్ల ఇంటివైపు దారితీసాను పైడితల్లి పిలుస్తున్నా వినబడనట్లు.

★★★

"ఏరా తమ్ముడూ! అంతలా తడుస్తూ రాకపోతే ఎక్కడన్నా ఆగలేకపోయావా?'' తువ్వాలు అందిస్తూ అంది భాగ్యం.

నేను చిన్నగా నవ్వి తువ్వాలు తీసుకున్నాను.రాత్రి భోజనాల దగ్గర కూడా నేను పెద్దగా ఏమీ మాట్లాడలేదు.

"వీడో పెద్ద మూడీఫెలో'' నవ్వుతూ బావగారితో అంటోంది అక్క.

"పెళ్లాం మీదకు మనసు పోయిందేమో'' నవ్వుతూ అన్నాడు బావ.

ఎప్పుడు మోదుకూరు వచ్చినా ఉదయం ఐదుగంటల బస్సుకి కాకినాడకు వెళ్లడం అలవాటు. అందుచేత పెందరాళే మంచం ఎక్కేసాను. నడుం వాల్చానన్న మాటేగానీ నిద్ర పట్టడంలేదు. రామప్పగారు చనిపోయి దగ్గర దగ్గర నెలరోజులవుతోందని పైడితల్లి అన్న మాటలే నా చెవిలో కాపురం పెట్టేసాయి. అంటే నేను అంతసేపు మాట్లాడింది చనిపోయి దెయ్యం అయిన రామప్పగారితోనా? అర్ధరాత్రివరకూ ఆలోచనలతో కుస్తీ పట్టి నేనే గెల్చి ఓ రెండుగంటలు పడుకున్నాను.

మూడున్నరకి లేచి స్నానం చేసి బ్యాగ్ సర్దుకుంటుంటే "ఇదిగోరా తమ్ముడు కాఫీ'' అంటూ కప్పు చేతికందించింది భాగ్యం అక్క.

"అక్కా! నేనో విషయం అడుగుతాను చెప్పు'' అన్నాను నెమ్మదిగా.

"చెప్పరా'' అంటూ నావైపు ఆసక్తిగా చూస్తూ అంది అక్క.

"రామప్పపంతులుగారు నీకు తెలుసా?'' అడిగాను.

"ఆ...తెలియకేం, బాగా తెలుసు. రోజూ మనింట్లో పేపరు చూడందే ఆయన దినచర్య మొదలుపెట్టరు. అప్పుడప్పుడు నేను కాఫీ ఇస్తే తాగేవారు. పక్కపోర్షన్‌లోనే ఉండేవారట. మేము ఈ ఊరు వచ్చేముందరే అనుకుంటా ఊరు చివర కొడుకు కట్టిన ఇంట్లోకి వెళ్లిపోయారు. అయినా రోజూ ఉదయాన్నే వచ్చి పేపరు చూసేవారు.పాపం నెలరోజుల క్రిందట జబ్బుచేసి పోయార్రా. ఇంతకీ నీకెందుకురా ఆయన విషయం?'' ఆసక్తిగా నా మొహంలోకి చూస్తూ అడిగింది అక్క. నేను నిన్న సాయంత్రం కాలువ గట్టుమీద జరిగిన విషయం పూస గుచ్చినట్లు చెప్పాను.

"పైడితల్లి రామప్పపంతులుగారి గురించి చెప్పడమేమిటిరా? అది కాలువ దగ్గర ఊబిలో కూరుకుపోయి వారం క్రిందట చనిపోయిందికదా'' అక్కయ్య ఆశ్చర్యంగా నోరు తెరిచి అడిగింది.

నేను బస్సు దగ్గరకు వెళుతూ కాలువగట్టు మీద పైడితల్లి కనిపించిన చింతచెట్టు దగ్గరికి వచ్చి చూసాను ఆసక్తిగా. మసక మసక చీకట్లో నిన్న రాత్రి నేను పైడితల్లికి ఇచ్చిన యాభై రూపాయలనోటు గాలికి రెపరెపలాడుతోంది. దగ్గరగా వెళ్లి చూసాను. యాభై రూపాయల నోటుమీద బరువు పెట్టి వుంది. ఆ బరువు మరేమిటో కాదు, రామప్పపంతులుగారి ముక్కుపొడెం డబ్బా. ఆ రోజు నేను ఎక్కిన మొదటి బస్సే నాకు ఆఖరి బస్సయింది. నేను మళ్లీ మోదుకూరుకు వెళ్లలేదు.

★



## మంచు పర్వతాల క్రింద జీవరాశి

ఇప్పుడు భూమిపైనున్న ప్రాణకోటికి అతీతమైన జీవులేవో నాలుగు లక్షల ఏళ్లక్రితం భూమిపై జీవించాయని, వాటిలో కొన్ని అంటార్కికా మంచు ఖండంలో పొరల అడుగున నిక్షిప్తమై పోయాయని ఇటీవల బ్రిటిష్ శాస్త్రజ్ఞుల పరిశోధనల్లో తేలింది. ఆ జీవరాశిని కనుగొనడానికి గతంలో ఎన్నడూ చేయని సాహసం చేసి ఆ మంచు కొండల్లో రెండు మైళ్ల లోతు దాకా డ్రిల్లింగ్ చేసుకుంటూ పోతారుట. అంత లోతున అంత మంచులో కనుక జీవరాశి బ్రతికి వుంటే గురువు లాంటి శీతల గ్రహాల్లో కూడా జీవరాశి బ్రతికి వుంటుందని, ఆ గ్రహాల్ని భవిష్యత్తులో సందర్శించి పరిశోధించవచ్చని వారంటున్నారు. 2012 నాటికి ఈ శాస్త్రజ్ఞుల పరిశోధనకు రూపం వస్తుందని అంచనా.

-తటవర్తి

